బంగారం.. హై జంప్

ఒక్కరోజే రూ.1,400 ఎగబాకిన తులం ధర

ఢిల్లీలో రూ.74,150కి చేరిక

వెండి రూ.3,150 ఎగిసి కిలోరూ.87,150 వద్దకు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: బంగారం ధరలు భారీగా పెరిగాయి. మంగళవారం ఒక్కరోజే తులం 24 క్యారెట్ గోల్డ్ రేటు ఏకంగా రూ.1,400 ఎగిసింది. గడిచిన నెల రోజుల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. దీంతో ఢిల్లీ మార్కెట్‌లో 99.9 స్వచ్ఛత కలిగిన పుత్తడి రూ.74,150 పలికింది. సోమవారం ఇది రూ.72,750గా ఉన్నది. ఇక 22 క్యారెట్ పసిడి విలువ కూడా ఇంతే స్థాయిలో పుంజుకున్నది. ఫలితంగా 99.5 స్వచ్ఛత కలిగినది 10 గ్రాములు రూ.73,800గా ఉన్నది. మార్కెట్‌లో బంగారానికి స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ ఉండటం, అంతర్జాతీయంగా కూడా ఆదరణ పెరగడం.. ధరల్ని పరుగులు పెట్టిస్తున్నదని ట్రేడర్లు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బంగారంపై దిగుమతి సుంకాన్ని తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో అదే రోజున రూ.3,350 క్షీణించింది. ఆ తర్వాత కూడా కొద్ది రోజులు పతనం దిశగానే పయనించింది. కానీ మళ్లీ ఇటీవలి కాలంలో ధరలు పుంజుకుంటున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లోనూ గోల్డ్ సేల్స్ జోష్ మీదనే కనిపిస్తున్నాయి. అయినప్పటికీ 22 క్యారెట్ 10 గ్రాములు రూ.66,600, 24 క్యారెట్ రూ.72,650గానే ఉన్నాయి.

వెండి ధరలూ దౌడు

వెండి ధరలూ పెద్ద ఎత్తున పెరిగాయి. ఢిల్లీలో ఈ ఒక్కరోజే కిలో రేటు రూ.3,150 ఎగిసింది. దీంతో అక్కడ కేజీ సిల్వర్ విలువ రూ.87,150గా నమోదైంది. ఇక హైదరాబాద్‌లో కిలో రూ.1,000 పెరిగి రూ.92,000 మార్కును తాకింది. గ్లోబల్ మార్కెట్ విషయానికొస్తే.. ఔన్సు గోల్డ్ 18.80 డాలర్లు పెరిగి 2,560.10 డాలర్లను చేరింది. సిల్వర్ 30.19 డాలర్లుగా ఉన్నది. 'అమెరికా ఫెడ్ రిజర్వ్ పాలసీ, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ఇతరత్రా పరిణామాలు.. బంగారం ధరల్ని నిర్దేశిస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో స్థిరంగా ఔన్సు ధర 2,500 డాలర్లపైనే పలుకుతున్నది' అని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

ఫ్యూచర్ మార్కెట్‌లో..

ఫ్యూచర్ మార్కెట్‌లో పుత్తడి ధరలు క్షీణించాయి. అంతర్జాతీయ పరిణామాలు రేట్లను ప్రభావితం చేస్తున్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే అక్టోబర్ డెలివరీకిగాను మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌పై గోల్డ్ కాంట్రాక్ట్స్ రూ.71,583 పలికింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ ఉద్రిక్తతల మధ్య అమెరికా, ఆసియా, ఐరోపా ఈక్విటీ మార్కెట్ల కదలికలు.. మదుపరులను ప్రభావితం చేస్తున్నాయంటున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): రిజర్వు బ్యాంకు 90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా క్విజ్‌ను నిర్వహిస్తున్నది. జాతీయ స్థాయిలో క్విజ్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు, ఇందుకు సంబంధించి కళాశాలలవారీగా విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నది. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10 లక్షలు, రూ.8 లక్షలు, రూ.6 లక్షలుగా నిర్ణయించింది. వివరాలకు ttps://www.rbi90quiz.in సంప్రదించాలని సూచించింది.

కిమ్స్‌లో పెరిగిన ఎస్బీఐ లైఫ్ వాటా

న్యూఢిల్లీ, ఆగస్టు 20: కిమ్స్‌లో ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా 7.75 లక్షల షేర్లను రూ.184 కోట్ల కు కొనుగోలు చేసింది. దీంతో కిమ్స్‌లో ఎస్బీఐ లైఫ్ వాటా మరో 0.97 శాతం పెరిగినట్లు అయింది.

444 రోజుల ఎఫ్‌డీపై 7.85 శాతం వడ్డీ

ఐడీబీఐ బ్యాంక్ ప్రత్యేక డిపాజిట్ స్కీం

న్యూఢిల్లీ, ఆగస్టు 20: డిపాజిట్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా ఐడీబీఐ బ్యాంక్ మరో ప్రత్యేక డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. 444 రోజుల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై 7.85 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతోపాటు 375 రోజుల కాలపరిమితి కలిగిన ఎఫ్‌డీలపై 7.75 శాతం వడ్డీని చెల్లించనున్నట్లు తెలిపింది. ఉత్సవ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పేరుతో ప్రవేశపెట్టిన ఈ డిపాజిట్ స్కీం సెప్టెంబర్ 30 వరకు అమలులో ఉండనున్నదని బ్యాంక్ పేర్కొంది. ఈ స్కీం బ్యాంక్ వెబ్‌సైట్ లేదా మొబైల్ బ్యాంకింగ్ అప్లికేషన్ లేదా బ్యాంక్‌నకు సంబంధించి ఏదైనా బ్రాంచ్‌లో ప్రారంభించుకోవచ్చునని సూచించింది.

మంగళవారం హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన క్రెడాయ్ స్టేట్‌కాన్ 2024 సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు

ఆరేండ్లలో పూర్తిగా సిద్ధం

అమర రాజా బ్యాటరీ ప్లాంట్‌పై మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ జిల్లాలోని దివిటిపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న అమర రాజా లిథియం అయాన్ బ్యాటరీ ప్లాంట్.. పూర్తిస్థాయి ఉత్పత్తిని అందుకోవడానికి ఆరేండ్లు పడుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రూ.9,500 కోట్ల పెట్టుబడితో మొదలైన ఈ కర్మాగారం.. మొదటి దశ ఇప్పటికే పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించిందన్నారు. 2, 3 దశల నిర్మాణం వేగంగా సాగుతున్నదని చెప్పారు. ఈ క్రమంలోనే 2030 నాటికి ప్లాంట్.. పూర్తిస్థాయి ఉత్పత్తిని ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్లాంట్ ఏర్పాటుకు ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు 80 కిలోమీటర్ల దూరంలో దివిటిపల్లి వద్ద దీనికి 262 ఎకరాల భూములను అప్పుడే కేటాయించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మంత్రి శ్రీధర్ బాబు ప్లాంట్ నిర్మాణ పురోగతిపై సచివాలయంలో అమర రాజా చైర్మన్ జయదేవ్ గల్లాతోపాటు ఆ సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఈ పరిశ్రమలో ప్రస్తుతం 350 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు.

'ఫైబర్ గ్రిడ్'కు సహకరిస్తాం

కార్పొరేషన్ అధికారులతో కేంద్ర మంత్రి

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : మారుమూల ప్రాంతాలకు సైతం ఇంటర్నెట్ సేవలను విస్తరించేందుకు ఉద్దేశించిన తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చినట్టు అధికారవర్గాలు తెలిపాయి. మంగళవారం ఢిల్లీలో ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు కేంద్రమంత్రితో భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు. నెట్‌వర్క్ ఇంటిగ్రేషన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఖమ్మం, నిజామాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలను టీ ఫైబర్‌కు అప్పగించాలని అధికారులు కోరగా దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. భారత్ నెట్ ఉద్యమి పథకాన్ని టీ ఫైబర్‌కు విస్తరించాలని అధికారులు కోరారు. దీనివల్ల రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలు మరింత మెరుగవుతాయని చెప్పారు.

ఫ్లట్టర్ జీసీసీ సెంటర్

హైదరాబాద్, ఆగస్టు 20: అమెరికాకు చెందిన ఫ్లట్టర్ ఎంటర్‌టైన్‌మెంట్..హైదరాబాద్‌లో నూతన జీసీసీ ప్రారంభించింది. రూ.30 కోట్ల పెట్టుబడితో 80 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ కోసం ప్రస్తుతం 700 మంది సిబ్బందిని నియమించుకున్నట్లు, ఈ ఏడాది చివరినాటికి ఈ సంఖ్యను 900కి పెంచుకోనున్నట్లు కంపెనీ సీవోవో ఫిల్ బిషప్ తెలిపారు. అలాగే వచ్చే రెండేండ్లలో మొత్తం సిబ్బందిలో 40 శాతం మంది మహిళ ఉద్యోగులను నియమించుకోనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ రికార్డు

ముంబై, ఆగస్టు 20: ప్రముఖ బీమా సంస్థ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మరో మైలురాయికి చేరుకున్నది. జూలైతో ముగిసేనాటికి కంపెనీ అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్(ఏయూఎం) విలువ రూ.3 లక్షల కోట్లు దాటి రూ.3.14 లక్షల కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. క్లెయిం సెటిల్‌మెంట్ రేషియో 99.17 శాతంగా ఉన్నదని, కేవలం 1.27 రోజులోనే తమ పాలసీ సెటిల్‌మెంట్ చేస్తున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో అనూప్ బాగ్చి తెలిపారు.

రియల్టీలో మరో బూమ్

క్రెడాయ్ సమావేశంలో మంత్రి ఉత్తమ్

మాదాపూర్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో బూమ్ రాబోతున్నదని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో 'తెలంగాణ గోయింగ్ గ్లోబల్' థీమ్‌తో మంగళవారం క్రెడాయ్ స్టేట్‌కాన్ 2024 సమావేశం జరిగింది. దీనికి మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతోపాటు భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్ రెడ్డి, చైర్మన్ మురళీకృష్ణా రెడ్డి, ప్రెసిడెంట్-ఎలెక్ట్ కే ఇంద్రసేనా రెడ్డి, ఐజీబీసీ జాతీయ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. నిర్మాణ రంగంలో జరుగుతున్న అభివృద్ధికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు రూ.10 వేల కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. తెలంగాణను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. భవన, నిర్మాణ రంగాభివృద్ధికి సహకరిస్తామన్న ఆయన.. రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా రూపాంతరం చెందుతున్నదని వివరించారు.

నిజంగా గొప్పే..

దేశంలో 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ.. ఇంత త్వరితగతిన పురోగతి సాధించడం గొప్ప విషయమంటూ ఈ సందర్భంగా గత పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలనను పరోక్షంగా మంత్రి ఉత్తమ్ అభినందించడం గమనార్హం. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రపంచ స్థాయికి ఎదగడానికి ఎంతో సమయం పట్టదని ఆయన చెప్పారు. తెలంగాణ వృద్ధిరేటుకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపున్నదని గుర్తుచేశారు. కాగా, రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని విశ్లేషిస్తూ సీబీఆర్ఈ ఈ సందర్భంగా ఓ రిసెర్చ్ రిపోర్టును విడుదల చేసింది.

కొండ చరియలు పడి పవర్ స్టేషన్ ధ్వంసం

గువాహటి, ఆగస్టు 20: కొండ చరియలు విరిగి పడటంతో సిక్కింలోని ఎన్‌హెచ్‌పీసీ తీస్తా అయిదో దశ ఆనకట్ట పవర్ స్టేషన్ ధ్వంసమైంది. గత కొన్ని వారాలుగా తరచూ తక్కువ స్థాయిలో కొండ చరియలు విరిగిపడటంతో ఈ 510 మెగావాట్ల స్టేషన్‌కు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం ఈ స్టేషన్‌ను ఖాళీ చేయించడంతో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. గతేడాది అక్టోబర్‌లో భారీ వర్షం కారణంగా ల్హోనాక్ హిమానీ నదపు సరస్సు కట్టలు తెగిపోవడంతో అయిదో దశ ఆనకట్ట పనికి రాకుండా పోయింది.

నేడు భారత్ బంద్

- రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి పిలుపు
- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం తీర్పుపై నిరసన
- దళిత, ఆదివాసీ సంఘాల మద్దతు

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం భారత్ బంద్ నిర్వహిస్తున్నట్టు రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి ప్రకటించింది. ఈ బంద్‌కు రాజస్థాన్‌లోని ఎస్సీ, ఎస్టీ సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఆయా రాష్ర్టాల్లోని పరిస్థితులకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలలో కులాలను ఉప కులాలుగా విభజించి రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ర్టాలకు దఖలు పరుస్తూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. అయితే సుప్రీంకోర్టు తీర్పు అన్యాయంగా ఉన్నదని, దీని గురించి దేశ ప్రజలకు వెల్లడించేందుకు బుధవారం భారత్ బంద్ నిర్వహిస్తున్నట్టు సమితి ప్రకటించింది. పలు సామాజిక, రాజకీయ సంఘాలు, పార్టీలు ఈ బంద్‌కు మద్దతు ఇస్తాయని భావిస్తున్నారు. భారత్ బంద్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టినట్టు రాజస్థాన్ అధికారులు తెలిపారు.

దళిత, ఆదివాసీ సంఘాల మద్దతు

అట్టడుగు వర్గాలకు బలమైన రిజర్వేషన్, ప్రాతినిధ్యం కోరుతూ దళిత, ఆదివాసీ సంస్థలు కూడా భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ దళిత్ అండ్ ఆదివాసీ ఆర్గనైజేషన్ (ఎన్‌ఏసీడీఏఓఆర్) తమ డిమాండ్ల లిస్టును విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు సమానత్వం, న్యాయం కల్పించాలని కోరింది. రిజర్వేషన్లపై ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఎస్సీ, ఎస్టీలకు సంక్రమించిన రాజ్యాంగ హక్కులకు భంగం కలిగిస్తుందని పేర్కొంది. దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు బుధవారం శాంతియుతంగా భారత్ బంద్‌లో పాల్గొని తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చింది.

యూజర్‌నేమ్‌తో వాట్సాప్‌లో మెసేజ్‌లు!

మొబైల్ నంబర్ అవసరం లేదిక..

న్యూఢిల్లీ: యూజర్ల అనుభవాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ తీసుకొస్తున్న ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఈసారి మరో కొత్త అప్‌డేట్‌తో వచ్చేస్తున్నది. ఇకపై ఫోన్ నంబర్‌తో పనిలేకుండా యూజర్‌నేమ్‌తోనే మెసేజ్‌లు పంపేలా సరికొత్త ఫీచర్‌ను జోడించబోతున్నది. కొత్త వ్యక్తికి మన నంబర్ ఇచ్చేందుకు సంకోచించే వారికి ఇది చక్కగా ఉపయోగపడుతుంది. అయితే, యూజర్ నేమ్ చెప్పే సమయంలో మన నాలుగు అంకెల పిన్ నంబర్‌ను కూడా చెప్పాల్సి ఉంటుంది. దీనిని మనమే క్రియేట్ చేసుకోవచ్చు. మనమిచ్చే యూజర్ నేమ్‌తోపాటు ఆ పిన్ నంబర్‌ను ఎంటర్ చేస్తేనే అవతలి వ్యక్తి మనకు మెసేజ్ చేయడం వీలవుతుంది. అయితే, ఇప్పటికే మీ కాంటాక్ట్స్‌లో ఉన్న వారికి మాత్రం ఇదేమీ వర్తించదు. వారు యథావిధిగానే చాటింగ్, మెసేజ్‌లు కొనసాగించవచ్చు. యూజర్ల ప్రైవసీకి మరింత రక్షణ కల్పించడంలో భాగంగానే వాట్సాప్ ఈ నిర్ణయం తీసుకుంది.

ఆప్ ఎంపీ సంజయ్‌ను అరెస్టు చేయండి!

యూపీ కోర్టు ఆదేశాలు

సుల్తాన్‌పూర్: రెండు దశాబ్దాల నాటి ఓ కేసులో విచారణకు హాజరుకాకపోవడంపై ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌పై యూపీలోని సుల్తాన్‌పూర్ కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన్ను అరెస్టు చేసి, ఈ నెల 28న తమ ముందు హాజరుపర్చాలని పోలీసులను ఆదేశించింది. మంగళవారం కోర్టుకు రావాలని ఆదేశిస్తూ సంజయ్ సింగ్‌తోపాటు ఎస్పీ నేత అనూప్ సందాపై కోర్టు ఈ నెల 13న నాన్ బెయిలబుల్ వారెంట్ జారీచేసింది. అయితే నిందితులు కోర్టుకు హాజరు కాలేదు. విద్యుత్తు సరఫరా సమస్యపై మాజీ ఎమ్మెల్యే అనూప్ సందా నేతృత్వంలో రోడ్డును దిగ్బంధించి నిర్వహించిన ఆందోళనకు సంబంధించి 2001, జూన్‌లో ఓ కేసు నమోదైంది. ఇందులో సంజయ్ సింగ్ పాల్గొన్నారు.

వినేశ్ X బబితా

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఫోగాట్ సిస్టర్స్‌పోటీ?

బబితా | వినేశ్

న్యూఢిల్లీ: ఇటీవలి ప్యారిస్ ఒలింపిక్స్‌లో స్వల్పంగా బరువు ఎక్కువ ఉండటంతో రెజ్లింగ్‌లో పతకాన్ని చేజార్చుకున్న వినేశ్ ఫోగాట్ రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. వచ్చే నెలలో హర్యానాలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె తన కజిన్, కామన్‌వెల్త్ గేమ్స్‌లో రెజ్లింగ్ పతకధారి అయిన బబితా ఫోగాట్‌పై పోటీ చేయవచ్చని ఆమె సన్నిహిత వర్గాలు తెలిపాయి. అయితే తాను క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్టు వినేశ్ ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా, స్వరాష్ట్రమైన హర్యానా నుంచి ఆమెను పోటీకి దింపాలని కొన్ని పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. వినేశ్‌ను ఎంపీ దీపేందర్ హుడా కాంగ్రెస్‌లోకి ఆహ్వానించినట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో తన పెద్దనాన్న కుమార్తె అయిన బబితా ఫోగాట్‌పై ఈసారి ఆమె ఎన్నికల్లో పోటీకి దిగుతారని ప్రచారం జరుగుతున్నది. కాగా, బబితా ఫోగాట్ బీజేపీలో చేరి ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో దాద్రి నుంచి పోటీ చేసి ఓటమి చెందారు.

చంద్రయాన్-4,5 డిజైన్‌లు పూర్తి

ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 20: చంద్రుడిపై ప్రయోగాలకు సంబంధించి తదుపరి చేపట్టబోయే చంద్రయాన్-4, 5 మిషన్ల రూపకల్పన పూర్తయిందని, ప్రభుత్వ అనుమతి తీసుకొనే ప్రక్రియలో ఉన్నామని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-4 ప్రయోగం ద్వారా చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసి అక్కడి రాళ్లు, మట్టిని తీసుకురావడం లక్ష్యమన్నారు. అదేవిధంగా రానున్న ఐదేండ్లలో 70 ఉపగ్రహాలను ప్రయోగించాలనే లక్ష్యంతో ఇస్రో ప్రణాళికలు వేస్తున్నదని తెలిపారు. 2028లో చంద్రయాన్-4 చేపట్టే లక్ష్యంతో ఉన్నామని అంతకుముందు ఇస్రో అధికారులు పేర్కొన్నారు.

ట్రైన్ ఫోర్స్ వన్!

- రైలు మార్గంలో ఉక్రెయిన్‌కు మోదీ
- పోలాండ్ నుంచి 10 గంటల ప్రయాణం

కీవ్, ఆగస్టు 20: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైలు మార్గాన ఉక్రెయిన్‌కు వెళ్లనున్నారు. పోలాండ్, ఉక్రెయిన్ పర్యటన కోసం మోదీ 22న బయలుదేరుతారు. పోలాండ్‌లో ఆయన పర్యటన ముగిసిన అనంతరం ఉక్రెయిన్ సరిహద్దు నుంచి 'ట్రైన్ ఫోర్స్ వన్'లో ఉక్రెయిన్ రాజధాని కీవ్ చేరుకోనున్నారు. ఇందుకోసం ఆయన 10 గంటల పాటు రైలు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కీవ్‌లో ఏడు గంటల పాటు మోదీ ఉండనున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన అనంతరం తిరిగి ఇదే రైలులో పోలాండ్ చేరుకొని అక్కడి నుంచి భారత్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. విలాసవంతమైన రైలుగా గుర్తింపు పొందిన ట్రైన్ ఫోర్స్ వన్‌లో మోదీ కంటే ముందు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యూయెల్ మాక్రాన్, జెర్మన్ చాన్సిలర్ ఒలాఫ్ స్కూల్జ్ వంటి వారు ప్రయాణించారు.

అధునాతన సదుపాయాలు

రష్యాతో యుద్ధం కారణంగా ఉక్రెయిన్‌లో ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. నిత్యం బాంబు దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి భద్రతను దృష్టిలో పెట్టుకొని ఉక్రెయిన్‌లో పర్యటించే దేశాధినేతలు అందరూ ఇదే రైలులో ప్రయాణిస్తున్నారు. ఈ రైలులో స్టార్ హోటల్ తరహా సదుపాయాలు ఉంటాయి. చెక్కతో చేసిన క్యాబిన్లు, పనులు చేసుకోవడానికి టేబుల్, సోఫా, సేదతీరడానికి మంచం, టీవీ వంటి అన్ని సదుపాయాలు ఉంటాయి.

ఉత్తమ్ సింగ్, చిత్రకు లతా మంగేష్కర్ అవార్డు

ఇండోర్, ఆగస్టు 20: 2022, 2023కు సంబంధించి జాతీయ లతా మంగేష్కర్ అవార్డుకు వరుసగా ప్రముఖ సంగీతకారుడు ఉత్తమ్ సింగ్, గాయని కేఎస్ చిత్ర ఎంపికయ్యారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం మంగేష్కర్ జయంతి సెప్టెంబర్ 28 నాడున నిర్వహించే కార్యక్రమంలో వీరిద్దరికి అవార్డులను ప్రదానం చేయనున్నదని ఓ అధికారి మంగళవారం వెల్లడించారు. ప్రతి ఏడాది లతా మంగేష్కర్ జన్మదినాన మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక విభాగం ఈ అవార్డును అందిస్తున్నది. మొదటిసారిగా ఈ అవార్డు ప్రదానోత్సవం మంగేష్కర్ స్మారకంగా నిర్మించిన ఆడిటోరియంలో జరుగనున్నది.